క్లుప్తంగా

విద్యతోనే మంచి భవిష్యత్



మాట్లాడుతున్న హెచ్‌ఎం గోపిస్వామి

కార్వేటినగరం: విద్యార్థి దశలో జ్ఞానార్జనపై శ్రద్ధ పెడితే గొప్ప భవిష్యత్‌కు పునాది లాంటిదని హెచ్‌ఎం గోపిస్వామి(ఎస్‌ఎస్ కొండ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం) అన్నారు. శనివారం మండల పరిధిలోని డీఎంపురం ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం కేశవులు ఆధ్వర్యంలో తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమని, పిల్లలను తల్లిదండ్రులు కూడా విద్యాభ్యాసానికి ప్రోత్సహించాలని సూచించారు. నైతిక విలువలతో కూడిన విద్య ఆవశ్యకతను తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ఆర్ముగం

పుత్తూరు: ముందస్తు జాగ్రత్తల ద్వారా ఎయిడ్స్‌ను నియంత్రించవచ్చని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సూపర్‌వైజర్ ఆర్ముగం తెలిపారు. శనివారం స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్‌కు చికిత్స లేదని, నివారణే మార్గమని తెలిపారు. తల్లి నుంచి బిడ్డలకు, రక్తమార్పిడి సమయంలో, బార్బర్ షాపుల్లో తగిన జాగ్రత్తలు పాటించకపోవడంతో ఈ వైరస్ వ్యాప్తి చెందుతుందని తెలిపారు. వైరస్ పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ ఎం.షర్మిల, వైస్ ప్రిన్సిపల్ వీరయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



కార్వేటినగరం: రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దాతలు అన్నదానం చేశారు. శనివారం మండల పరిధిలోని ఆర్కేవీబీపేట ఇందిరా కాలనీకి చెందిన విశ్రాంతి హెచ్‌ఎం కే.సుబ్రమణ్యం 12వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులు ఆశ్రమానికి వెళ్లి స్వయంగా వారి చేతులతో వృద్ధులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు చలపతి మాట్లాడుతూ అనాథ వృద్ధులకు అన్నదానం చేయడంలో ఎంతో ఆనందం ఉంటుందన్నారు. కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు అన్నపూర్ణమ్మ, చలపతి, ఉష, శ్రీదేవి, సాయి రేష్మ, అశ్విత సాత్విక్, రాస్ కోఆర్డినేటర్ ప్రకాష్ పలువురు పాల్గొన్నారు.

మహిళా కార్యకర్తకు డిప్యూటీ సీఎం నివాళి



లక్ష్మి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : మండలంలోని పద్మపురం దళితవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ మహిళ కార్యకర్త లక్ష్మి (65) శుక్రవారం సాయంత్రం అనారోగ్యంతో మరణించింది. సమాచారం అందుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ఆదుకుంటామని భరోసా కల్పించారు. మంత్రి వెంట ఎంపీపీ సరిత, స్థానిక సర్పంచ్ భాస్కర్ నాయుడు, మండల కన్వీనర్ మణి, నాయకులు జెడ్పీటీసీ మాజీ సభ్యులు గురవారెడ్డి, నాయకులు జనార్దన్, కుప్పయ్య, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో దేవదాయ ముఖ్య కార్యదర్శి



ఆలయంలో దేవదాయశాఖ ముఖ్యకార్యదర్శి కరికాల వల్లవన్

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం రాష్ట్ర దేవదాయ, ధర్మదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కరికాల వల్లవన్ దర్శించుకున్నారు. శనివారం ఆయన ఆలయానికి చేరుకోగా ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ కేఎస్ రామారావు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

వైఎస్సార్ డిగ్రీ కళాశాలకు మహర్దశ

- రూ.17.82 కోట్లతో పక్కాభవన నిర్మాణాలు
- నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- మండల ప్రజల తరపున డిప్యూటీ సీఎం నారాయణస్వామికి వైఎస్సార్‌సీపీ నేతల కృతజ్ఞతలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగరాణి

వెదురుకుప్పం: ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మహర్దశ వచ్చిందని ఎంపీపీ నాగరాణి అన్నారు. శనివారం ఆమె మండలకేంద్రంలో శనివారం పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. మండలంలోని చవటగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాలకు సంబంధించి తరగతి గదుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.17,82,50,000 నిధులు మంజూరు చేసినట్లు ఆమె తెలిపారు. పచ్చికాపల్లంలో కేటాయించిన ప్రభుత్వ స్థలంలో పక్కా భవన నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ ద్వారా నిధుల మంజూరుకు సంబంధించి ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి కొత్తగా డిగ్రీ కళాశాల మంజూరు చేయించిన ఘనత ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిదే అన్నారు. అయితే చవటగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిగ్రీ తరగతులు నడుస్తుండడంతో విద్యార్థులకు అసౌకర్యంగా ఉండేదన్నారు. సమస్యను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురావడంతో ప్రభుత్వ ఉన్నతాధికారులతో చర్చించి వెంటనే నిధులు మంజూరు చేయాలని ఆదేశించారని తెలిపారు. ఇటీవల ఇంజినీరింగ్ అధికారులు కూడా పచ్చికాపల్లంలో కళాశాల కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. ప్రస్తుతం నిధులు మంజూరు కావడంతో విద్యార్థుల కష్టాలు తీరతాయన్నారు. కాగా నిధులు మంజూరు చేయించిన మంత్రి నారాయణస్వామి మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయనకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ సుబ్రమణ్యం, ఎంపీటీసీలు రమణమ్మ, హరి, కో-ఆప్షన్ సభ్యుడు వెంకటేష్, సర్పంచ్‌లు గోవిందయ్య, రాజేశ్వరి, దాక్షాయణి, బాబు, శ్రీనాథ్‌రెడ్డి, నాయకులు పెద్దిరెడ్డి, మునికృష్ణారెడ్డి, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిలో పెనుమూరు ఆదర్శం



పెనుమూరు: నిర్మాణంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ పనులను పరిశీలిస్తున్న నాయకులు

పెనుమూరు(కార్వేటినగరం): అభివృద్ధిలో పెనుమూరు మండలం గంగాధరనెల్లూరు నియోజకవర్గానికే ఆదర్శంగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చొరవతో రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న ఆర్టీసీ బస్టాండు, షాపింగ్ కాంప్లెక్స్‌లను శనివారం ఆయన స్థానిక నాయకులతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 75 ఏళ్లలో అభివృద్ధికి నోచుకోని మండలం నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చొరవతో శరవేగంగా అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని తెలిపారు. అలాగే మండంలో కనిగిరి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని టీటీడీలో విలీనం చేసి రూ.కోట్లు వెచ్చించి ఆలయానికి నూతన శోభను తీసుకొచ్చిన ఘనత డిప్యూటీ సీఎంకే దక్కుతుందన్నారు. అదేవిధంగా మారుమూల ప్రాంతమైన పెనుమూరు మండలానికి 50 పడకల ఆస్పత్రి మంజూరు చేయించడంతో పాటు, ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయిస్తున్నట్లు తెలిపారు. ఎన్నడూ లేనివిధంగా మండలాన్ని నియోజకవర్గానికి ఆదర్శంగా అభివృద్ధి చేస్తున్న డిప్యూటీ సీఎంకు మండల ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వందేభారత్ .. జర్నీ సూపర్



వందేభారత్ ట్రైన్‌లో తోటి ప్రయాణికులతో సరదాగా ముచ్చటిస్తున్న మంత్రి రోజా



చిన్నారిని సరదాగా పలకరిస్తున్న మంత్రి రోజా

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా గుంటూరు నుంచి వందేభారత్ ట్రైన్‌లో తిరుపతికి వచ్చారు. అయితే ట్రైన్‌లో ప్రయాణిస్తున్న మంత్రిని చూసిన తోటి ప్రయాణికులు ఆమెతో ముచ్చటించడానికి ఉత్సాహం చూపారు. సెల్ఫీలు దిగారు. మంత్రి రోజా కూడా ప్రయాణికులతో ఆత్మీయంగా పలకరించారు. తన సీట్ పక్కన కూర్చున్న పసిబిడ్డలను ముద్దాడుతూ, చిన్నారులతో కలిసి ఉల్లాసంగా గడుపుతూ ప్రయాణించారు. అనంతరం వందేభారత్ ట్రైన్ నిర్వహణ బాగుందని, శుభ్రంగా ఉంచుతున్నారని, చక్కటి భోజనం అందిస్తున్నారని, గమ్యాన్ని సేఫ్‌గా త్వరగా చేరుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉందని మంత్రి ప్రశంసల వర్షం కురిపించారు. - నగరి

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం



వికసిత సంకల్ప యాత్రలో భాగంగా ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

పాలసముద్రం : మండలంలోని తిరుమలరాజుపురం పంచాయతీల్లో వికసిత భారత సంకల్ప యాత్రను మండలకేంద్రంలో శనివారం ఎంపీడీఓ రామనాథరెడ్డి, వైద్యాధికారి మోహన్‌కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రధానమంత్రి వీడియో సందేశాన్ని ప్రజలకు వినిపించారు. అనంతరం ఎంపీడీఓ రామనాథరెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న 17 రకాల పథకాలు, వాటి లబ్ధి గురించి వివరించారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు ఉపాధి అవకాశాలు మెరుగు పరుచుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. గర్భిణులకు ప్రధాన మంత్రి మాతృత్వ అభియాన్ కింద ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులచే నృత్యాలతో అలరించారు. అనంతరం వికసిత భారత సంకల్పయాత్రకు సంబంధించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం ఫరీద్‌మస్తాన్, ఉపాధిహామీ ఏపీఓ మార్గరేట్, ఏఓ డిల్లీప్రసాద్, సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సర్పంచ్ జీవిత, విస్తరణాధికారి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన దళిత వ్యతిరేక పార్టీలు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

శ్రీరంగరాజపురం: టీడీపీ, జనసేన దళిత వ్యతిరేక పార్టీలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కుప్పయ్య అన్నారు. శనివారం ఈ సందర్భంగా మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు దళితులను ఓటు బ్యాంకుగానే వాడుకున్నారే తప్ప ఏనాడు దళితుల అభివృద్ధికి కృషి చేయలేదన్నారు. ఎవరైనా దళితులుగా పుట్టాలనుకుంటారా ? అని చంద్రబాబు అన్నారని, మళ్లీ ఇప్పుడు దళితుల ఓట్ల కోసం వస్తున్నారని, ఓట్లను అడిగే అర్హత లేదన్నారు. టీడీపీ, జనసేన పార్టీల్లో ఉన్న దళితుల వెంటనే ఆ పార్టీలను వీడి దళితుల అభివృద్ధికి కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీని ఆదరించాలన్నారు. రాజకీయ, ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్‌లో ఉన్నత పదవులతో పాటు డిప్యూటీ సీఎంగా అవకాశం కల్పించిన ఘనత జగనన్నకే చెందుతుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మణి, నాయకులు కాలప్ప, జనార్ధన్, మణి, మహేష్, బాబు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 29 మందికి ఉద్యోగాలు



మాట్లాడుతున్న అధికారులు చైతన్య, పవన్‌కుమార్

పెనుమూరు(కార్వేటినగరం): నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే జాబ్‌మేళా లక్ష్యమని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు చైతన్య, పవన్‌కుమార్ అన్నారు. శనివారం ఎస్‌వీవీ ప్రైవేటు డిగ్రీ కళాశాల ఆవరణలో మినీ జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు శనివారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి అమరరాజ గ్రూప్ ఆఫ్ కంపెనీ, యంగ్ ఇండియా, భారత్ ఎయిర్‌టెల్, క్రియా నెక్స్ వెల్త్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి బహుళ జాతీయ కంపెనీలు పాల్గొనడం జరిగిందన్నారు. ఈ జాబ్‌మేళాకు 72 మంది పాల్గొన్నారని, వారిలో ప్రతిభ కలిగిన 29 మందిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్‌వీవీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేంద్రరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సురేష్, గుణశేఖర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన



ప్రదర్శనను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం

నగరి : మున్సిపల్ పరిధిలోని ఏకాంబర కుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన సైన్స్ ప్రదర్శనలో విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రధానోపాధ్యాయులు నమశ్శివాయం ప్రదర్శనను ప్రారంభించారు. విద్యార్థుల ప్రదర్శనల వివరాలను అడిగి వారి అవగాహన తీరును పరిశీలించారు. సైన్స్, గణిత ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించడం జరిగింది.

ముగిసిన వర్క్‌షాప్

తిరుపతి సిటీ: శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం దూర విద్యాకేంద్రం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగిన వర్క్ షాప్ శనివారం ముగిసింది. ఇగ్నో ప్రొఫెసర్ సీఆర్‌కే మూర్తి దూరవిద్య ద్వారా అందిస్తున్న కోర్సులు, ఆన్‌లైన్ పద్ధతిలో కోర్సుల నిర్వహణపై అధ్యాపకులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్క్‌షాపులో ప్రొఫెసర్లు అరుణ, శైలేశ్వరి, మాధవి, బేబి ప్రసూన, 50 అధ్యాపకులు, స్కాలర్లు, పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన



గొల్లపల్లి దళితవాడలో సమస్యలను గుర్తిస్తున్న ఎంపీడీఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి చొరవతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని ఎంపీడీఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు మండల పరిధిలోని కామచిన్నయ్యగారిపల్లి సచివాలయం గొల్లపల్లి దళితవాడను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలకు డ్రైనేజీ, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి ఆదేశించినట్లు ఎంపీడీఓ తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు గ్రామాలను సందర్శించి, అక్కడ సమస్యలను గుర్తించి త్వరితగతిన ప్రణాళిక సిద్ధం చేసి పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు నిర్మల, పూర్ణచంద్ర, వలంటీర్లు ఉన్నారు.

విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై ఆసక్తి పెంచుకోండి



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

విజయపురం (నగరి) : మండలంలోని శ్రీహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యా వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. ప్రధానోపాధ్యాయుడు సోమశేఖర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రం, గణిత శాస్త్రానికి సంబంధించిన ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. పాఠశాల స్థాయిలో విజేతలైన విద్యార్థులను మంగళవారం నాడు మండల స్థాయిలో జరుగు విద్య వైద్యానిక ప్రదర్శనకు అర్హత సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య



ప్రోగ్రెస్ కార్డులు అందుకున్న విద్యార్థులతో ఉదయలక్ష్మి

నగరి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తున్నారని సర్వశిక్ష అభియాన్ కమ్యూనిటీ మొబలైజింగ్ అధికారి ఉదయలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని వేలావడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. పేరెంట్స్ కమిటీ సభ్యులతో సమావేశమైన ఆమె ప్రభుత్వ పాఠశాలలో అందించే నాణ్యమైన విద్య, సదుపాయాల గురించి వివరించారు. సమ్మేటివ్ పరీక్షలు (ఎస్‌ఎ1) ప్రశ్నాపత్రాల గురించి చర్చించారు. అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవీంద్రబాబు, పాఠశాల కమిటీ చైర్మన్ పెరుమాల్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కనుల పండువగా ఊంజల్ సేవ



ఉయ్యాల సేవలో ఉభయ నాంచారులతో కల్యాణ వెంకన్న

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ ప్రముఖ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ఊంజల్‌సేవ నేత్రపర్వంగా జరిగింది. శనివారం కావడంతో ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. సాయంత్రం శ్రీదేవి,భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను తిరుచ్చి వాహనంపై అధిష్టింప చేశారు. అనంతరం ఊంజల్ మండపంలోని ఊయలలో కొలువుదీర్చారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, జమేదార్ రాజశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అ'విశ్రాంత' సేవకులు

- ప్రతి విశ్రాంత ఉద్యోగికి బాసటగా నిలుస్తున్న పెన్షనర్స్ సంఘం
- రూ.50 లక్షలతో సొంత భవనం ఏర్పాటు
- సమాజసేవలో ఆదర్శంగా పుత్తూరు పెన్షనర్స్ సంఘ సభ్యులు
- నేడు జాతీయ విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం



వయోవృద్ధులను సన్మానిస్తున్న సంఘ సభ్యులు (ఫైల్)



పుత్తూరులోని విశ్రాంత ఉద్యోగుల భవనం



శతావధాని ఉప్పల ధడియం భరత్ శర్మచే ఏర్పాటు చేసిన అష్టావధానం (ఫైల్)

పుత్తూరు: పుత్తూరు ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సమాజసేవలో తన ప్రత్యేకతను చాటుకుంటూ ఆదర్శంగా నిలుస్తోంది. సంఘంలోని రిటైర్డ్ అయిన ప్రతి ఉద్యోగికి బాసటగా నిలవడానికి 2004లో పుత్తూరు పట్టణంలోని ఓ అద్దె భవనంలో జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ మునికృష్ణారెడ్డి ఫౌండర్ ప్రెసిడెంట్‌గా, సెక్రెటరీగా కె.నరసింహులు ఈ సంఘం ఏర్పడింది. నెల నెలా సమావేశాలు నిర్వహించడంతో పాటు సంఘ సభ్యులకు అన్ని విషయాల్లోనూ బాసటగా నిలుస్తూ వచ్చింది. సంఘం ఇచ్చే చేయూత, చేపట్టే కార్యక్రమాలతో సంఘంలో సభ్యుల చేరిక క్రమేపీ పెరుగుతూ వచ్చింది. పుత్తూరు ఎస్టీఓ పరిధిలోని పుత్తూరు, నారాయణవనం, పిచ్చాటూరు, వడమాలపేట మండలాల పరిధిలోని 1,030 మంది పెన్షనర్లతో పరిఢవిల్లుతోంది. 2016లో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కేవీ యుగంధర్‌రాజు, టీఆర్ రమేష్ సంఘ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 2019లో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బి.భాస్కర్‌రాజు, ఎ.రామచంద్రరాజు, పి.కుప్పయ్య నేతృత్వంలో భవన నిర్మాణం కార్యరూపం దాల్చింది. సంఘ సభ్యులు స్వచ్ఛందంగా ఇచ్చిన విరాళాలతో స్థానిక కార్వేటినగరం రోడ్డులోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకు సమీపంలో రూ.50 లక్షల వ్యయంతో విశాలవంతమైన భవనాన్ని నిర్మించుకున్నారు. ఈ భవనం 2020 నవంబర్ 11వ తేదీన ప్రారంభమైంది. అప్పటి నుంచి సేవా కార్యక్రమాలు మరింత వేగం పుంజుకున్నాయి. ప్రతి నెలా రాష్ట్రం నలుమూలల నుంచి విశిష్ట వ్యక్తులను ఆహ్వానించి, వారిచే విలువైన సలహాలు, సూచనలను స్వీకరించడంతో పాటు వృద్ధాప్యంలో ఎదురయ్యే సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో తెలియజెప్పించడం జరుగుతోంది. ఇలాంటి ఉపన్యాసాల ద్వారా విశ్రాంత ఉద్యోగుల్లో మనోధైర్యాన్ని, సంతోషాన్ని నింపుతున్నారు. ఈక్రమంలోనే ప్రముఖ అవధానులు డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్రచే సంగీత గేయధార కార్యక్రమం, శతావధాని ఉప్పలధడియం భరత్ శర్మచే అష్టావధానం కార్యక్రమాలను నిర్వహించి పుత్తూరు ప్రజలకు సరికొత్త అనుభూతిని కల్పించారు. ప్రకృతి వనం ప్రసాద్ వంటి ప్రముఖులను పుత్తూరుకు పిలిపించి విలువైన సలహాలు, సూచనలు అందిస్తున్నారు. తాము ఒకరికి ఒకరు సాయం చేసుకుంటూ అనాథలకు, వృద్ధులకు, దివ్యాంగులకు తమవంతు సాయం అందిస్తున్నారు. గుడ్ షెపర్డ్ ఆశ్రమంలోని వృద్ధులకు చీరల పంపిణీ చేశారు. మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఇలా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఒకరికి ఒకరు తోడుగా..!



ఒకరికి ఒకరు తోడుగా సమిష్టి కృషితో కట్టుకున్న బంధమే ఈ సంఘం. రిటైర్డ్ అనే పదం వినగానే ప్రతి ఒక్కరిలో అదో రకమైన భయం మొదలవుతుంది. వృద్ధాప్యం మీద పడుతుండడంతో కొందరు కుటుంబ వ్యక్తుల నుంచి చులకన కాబడుతారు. మరికొందరు కుటుంబాలకే దూరమవుతారు. ఎవరికి ఎలాంటి సాయం చేయడానికైనా సంఘం అన్ని వేళలా సిద్ధంగా ఉంది. ఇదే మాలోని ప్రతి ఒక్కరిలో ధైర్యాన్ని నింపుతూ ముందుకు నడిపిస్తోంది. అధ్యక్షుడిగా ప్రతి పనిని భారంగా కాకుండా ఒక బాధ్యతగా స్వీకరిస్తున్నాను.

- కె.భాస్కర్‌రాజు, అధ్యక్షుడు, ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం, పుత్తూరు